## నవతరం కోసం నవతరం రాసిన నవ్య కథ

సికింద్రాబాదు క్లాక్‌టవరు దగ్గరి పాసుపోర్టు ఆఫీసు, సమయం ఉదయం ఐదుగంటలు కావస్తోంది. అప్పటికే అక్కడ పాసుపోర్టు కోసం జనం క్యూలో బారులు బారులుగా నించున్నారు. కొడుకు శ్రవణ్ పాసుపోర్టు నిమిత్తం సుమారు ఓ గంటక్రితమే వచ్చి మిగతావారితో పాటుగా చాంతాడులాంటి లైనులో నిలబడ్డాడు పరమేశం.


'పాసుపోర్టు కౌంటరు ఎన్నిగంటలకు తెరుస్తారు?' తన ముందు నించున్న వ్యక్తిని అడిగాడు పరమేశం.

'ఎనిమిది గంటలకు' విసుగ్గా సమాధానమిచ్చాడా వ్యక్తి.

'మీరు ఎన్ని గంటలకు వచ్చి క్యూలో నిలబడ్డారు' మరలా ప్రశ్నించాడు పరమేశం.

'మీకన్నా ముందు' చిరాగ్గా, తలతిక్కగా చెప్పాడా వ్యక్తి.

# ఆత్మవంచన



### ఎస్. నాగేంద్రప్రసాద్

ఇంకేం అడిగితే ఏం అంటాడోనని ఊరుకున్న పరమేశం ఆ గుడ్డి వెలుగులో తాను తెచ్చుకొన్న ఆనాటి పేపరు చూడ్డంలో నిమగ్నమయ్యాడు.

'ఏయ్ ఏంటయ్యా! ఇప్పుడే వచ్చి నీ కన్నా ముందునించున్న మమ్మల్ని కాదని బలవంతంగా ఎందుకు లైనులోకి వస్తున్నావు' ఎవరో కుర్రాడి మీద అరిచారు మిగతా లైనులోని జనం.

'నేను మీ కన్నా ముందే వచ్చాను సార్. మంచినీళ్ళ బాటిల్ కోసమని వెళ్ళాను' సంజాయిషీగా చెప్పాడా కుర్రాడు.

విషయం తెలియని కొంతమంది ఇంకా ఆ కుర్రాడి మీద అరుస్తూ ఉంటే వారికి సర్ది చెప్పిన పరమేశం తిరిగి పేపరు చదవసాగాడు.

సమయం భారంగా గడిచి పాసుపోర్టు కార్యాలయంలో పని మెల్లిగా ప్రాంభమైంది. పరమేశం వంతు రాగానే కొడుకు శ్రవణ్ పాసుపోర్టు పేపర్లు ఆ క్లర్కుకి అందించి ఏమంటాడోనని ఆత్రంగా అతని వంక చూసాడు.

'ఏంటిసార్...! సాక్షి సంతకం అన్నచోట మీరు సంతకం చేసారు' క్లర్కు చిరాగ్గా మొహం పెట్టి అన్నాడు.

'ఏం బాబు... సాక్షి సంతకం నేను చేయకూడదా?' అమాయకంగా అడిగాడు పరమేశం.

కుదరదండి. మీరు తండ్రి సంతకం చేసారు కదా. అందుచేత, ఈ కాగితాలు రేపు తీసుకరండి. వెనక్కు పేపర్లు తిరిగి ఇచ్చేస్తూ అన్నాడు. వేరే ఎవరిచేతనైనా సాక్షి సంతకం చేయించి, ఆ క్లర్కు మీద పీకలదాకా కోపం వచ్చినా, అవసరం తనది కనక, కోపాన్ని పైకి కనబడనీయకుండా జాగ్రత్త పడ్డ పరమేశం 'అలా అనకు బాబు, తెల్లారకట్లనగా వచ్చి క్యూలో నించున్నాను. మరలా రేపంటే ఎంతో ఇబ్బంది కదా! అందుచేత మీరే ఏదో మార్గం చెప్పండి' వినయంగా అన్నాడు పరమేశం.

'ఫారం పూర్తిగా నింపడం రాదుగాని, పిల్లల్ని మాత్రం అమెరికాకి, లండనుకు పంపించాలనుకొంటారు' వ్యంగ్యంగా తోటి క్లర్కుతో అంటూ, సరే అయితే ఇక్కడే ఉన్న ఎవరిచేతనైనా సాక్షి సంతకం చేయించి ఇవ్వండి, కరకుగా క్లర్కు చెప్పడంతో అతను చెప్పినట్లే చేసి ఇంటిదారి పట్టాడు పరమేశం.

***

'ఏంటి నాన్నగారు పాసుపోర్టు ఆఫీసునుండేనా?' తండ్రి పరమేశాన్ని అడిగాడు శ్రవణ్.

అవును బాబూ, ఏం అలా అడుగుతున్నావు, తిరిగి ప్రశ్నించాడు పరమేశం.

ఏంలేదు నాన్నగారు... నాకు నాదేశాన్ని, మిమ్మల్ని వదిలి పై దేశాలకు వెళ్ళడం ఇష్టంలేదని

మీకు ఎన్నిసార్లు చెప్పాలి, సణుగుతూ అన్నాడు శ్రవణ్.

'ఏం ఎందుకట' అడిగాడు పరమేశం.

ఎందుకంటే నేను చదివిన చదువుకు ఇక్కడే మన ఇండియాలోనే మంచి ఉద్యోగం వస్తున్నప్పుడు కన్న వాళ్ళని, మాతృభూమిని వదిలి ఎందుకు వెళ్ళాలి! ఆ ఉద్దేశంతో చెబుతున్నాను, చెప్పాడు శ్రవణ్.

కాని పై దేశం వాళ్ళిచ్చే జీతం ఇక్కడి వాళ్ళు ఇవ్వ లేరన్న సంగతి ఏనాడైనా ఆలోచించావా? కొంచెం కోపంగా అన్నాడు పరమేశం.

తెలుసు, కాని జీవితంలో డబ్బు సంపాదన ఒక్కటే ధ్యేయం కాదు నాన్నాగారు. మనకి తిండికి, బట్టకి లోటు లేదుకదా. మరి అటువంటప్పుడు ఎందుకీ 'ఎండమావుల' వెంట పరుగులు, ఇంకా ఏదో చెప్పబోతున్న శ్రవణ్ మాటలకు మధ్యలోనే అడ్డొస్తూ 'గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందట' నువ్వు నాకు చెప్పొచ్చావనన్నమాట, వ్యంగ్యంగా నవ్వుతూ అన్నాడు పరమేశం.

నేను మీకు చెప్పేటంతటి వాడను కాను, కాని నన్ను బలవంతంగా ఎందుకు విదేశాలకు పంపిస్తున్నారు సూటిగా అడిగాడు శ్రవణ్.

ఎందుకంటే మనకు డబ్బు లేకా కాదు, డబ్బు సంపాదన కోసమూ కాదు, చెప్పటం ఆపాడు పరమేశం.

మరి అటువంటప్పుడు ఎందుకు నన్ను బలవంత పెడుతున్నారు?, 'పీర్ ప్రెషరా' అడిగాడు శ్రవణ్.

'పీర్ ప్రెషర్' అంటే అర్థంకాక అడిగాడు పరమేశం.

'అంటే మిగతావాళ్ళు ఏం చేస్తే మనం కూడా అదే చేయ్యాలని మనకి తెలియకుండానే మనమీద కలిగే వత్తిడి' చెప్పాడు శ్రవణ్.

అదేం కాదు, ఈ రోజుల్లో పిల్లలు విదేశాల్లో ఉన్నారని చెప్పుకోవడం ఒక గొప్పరా. అయినా నిన్ను శాశ్వతంగా వెళ్ళమనడం లేదుకదా. ఓ ఎనిమిది పదేళ్ళు అక్కడ గడిపి తిరిగి ఇండియాకి వచ్చేయి, సింపుల్‌గా చెప్పాడు పరమేశం.

ముందు అలాగే అంటారు నాన్నగారు. తీరా తిరిగి ఇండియాకి వచ్చేస్తానంటే 'ఆ... ఈ దిక్కుమాలిన ఇండియాలో ఏముందిరా' అంటూ అక్కడ నుండి తిరిగి రాకుండా మీరే అడ్డుకుంటారు. అమ్మ ఎలాగూ లేదు. ఉన్న ఒక్కగానొక్క కొడుకుని కూడా దూరంగా పంపించేసి మీరు ఒంటరిగా ఎలా ఉండగలరు నాన్నగారు? ఆయన మీదున్న అభిమానంతో అడిగాడు శ్రవణ్.

చెప్పాను కదరా, నిన్ను వెళ్ళమంటున్నది కొంతకాలం కోసమేనని, శ్రవణ్‌కి నచ్చచెప్పబోయాడు పరమేశం. అలా ఎన్నటికి జరగదు నాన్నగారు. మీ అవసాన దశలో కొడుకుగా నా అవసరం ఎంతో ఉంటుంది. మీరు దాని గురించి ఆలోచించకుండా, మీ మాటే నెగ్గాలని చూస్తున్నారు, తండ్రి మనసు మార్చే ప్రయత్నంగా అన్నాడు శ్రవణ్.

ఒరేయ్ ఆ విషయం నీతో చెప్పించుకొనే స్థితిలో లేనురా..! నువ్వే చెప్పు నువ్వు ఆమెరికాలో ఉద్యోగం చేస్తుంటే తండ్రిగా నాకెంత హోదాగాను, ఆనందంగాను ఉంటుందో, చెప్పాడు పరమేశం.

అంటే మీ ఆనందంకోసం, పేరు కోసం నా మనసుని, ఆశయాలను చంపుకోమంటారా? బాధగా అడిగాడు శ్రవణ్.

ఏంటిరా నీకున్న ఆశయాలు, ఆదర్శాలు. అవన్నీ చెప్పడానికి, వినడానికి మాత్రమే బాగుంటాయి. నీముందు వెళ్ళిన వారంతా ఆశయాలు, ఆదర్శాలు లేనివారంటావా? తిరిగి ప్రశ్నించాడు పరమేశం.

ఇంక ఎన్ని చెప్పినా తండ్రిని మార్చలేమని తెలిసిన శ్రవణ్ కోపంగా తన రూములోకి వెళ్ళిపోయాడు.

సమయం వస్తే అన్నీ వాడికే తెలుస్తాయని పరమేశం కూడా తన రూములోకి వెళ్ళిపోయాడు.

***

'నాయనా శ్రవణ్ జాగ్రత్త. అక్కడ మనదేశానికి, సంస్కృతికి చెడ్డపేరు వచ్చేలా ప్రవర్తించకుండా చక్కగా మసులుకో' అమెరికాకి వెళుతున్న కొడుకు శ్రవణ్‌తో బాధగా అన్నాడు పరమేశం.

నేనే మీ పెంపకంలో పెరిగిన వాడిని నాన్నా, అలా ఎన్నటికీ జరగదు, అంటున్న శ్రవణ్ పరమేశం కళ్ళల్లో ఏదో తెలియని బాధని చూసాడు. 'ఎందుకు నాన్నాగారు ఆ కన్నీళ్ళు. మీరు కావాలనే నన్ను పంపిస్తున్నారు కదా. ఆనందంగా ఉండండి, కళ్ళల్లో వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ అన్నాడు.

అంత మాటనకు బాబూ. నువ్వంటే ప్రేమలేక కాదురా నిన్ను అంతదూరం పంపిస్తున్నాది. ఇక్కడ చాలీ చాలని జీతాలతో ఇబ్బంది పడకూడదనే స్వార్థంతో ఈ పని చేస్తున్నాను, కొడుకు ఆఖరి నిముషంలో మనసు మార్చుకొంటాడేమోనన్న భయంతో నచ్చచెప్పబోయాడు పరమేశం.

సరే నాన్నగారు, మీ ఆరోగ్యం జాగ్రత్త, వస్తా అంటూ బరువైన గుండెతో విమానంవైపు నడిచాడు శ్రవణ్.

***

హలో... నాన్నా శ్రవణ్ ఎలా ఉన్నావురా? ఆనందంగా ఫోనులో కొడుకుని పలకరించాడు పరమేశం.

నేను బాగానే ఉన్నాను నాన్నా...! మీరెలా ఉన్నారు? నేను మనషిని మాత్రమే ఇక్కడున్నాను, నా మనసంతా అక్కడే ఉంది నాన్నా. ఇండియా వచ్చేస్తాను అంటే ఇంకా కొంతకాలం ఉండు అని గత మూడేళ్ళుగా నా నోరు మూయిస్తున్నారు. ఈ మూడేళ్ళ



లోను నాకు లిల్లీతో పెళ్లవడం, బాబు పుట్టడం కూడా జరిగిపోయాయి. ఇప్పటికైనా నామాట వినండి నాన్నా. దయచేసి నేను ఇండియాకి రావడానికి ఒప్పుకోండి, ప్లీజ్! ఫోనులోనే తండ్రిని వేడుకున్నాడు శ్రవణ్.

నీకు ఎన్నిసార్లు చెప్పలిరా! ఆ గ్రీన్ కార్డ్ వచ్చేవరకు అక్కడే ఉండమని. అయినా నీకు అక్కడ వచ్చిన ఇబ్బంది ఏమిటి? హాయిగా ప్రేమించిన అమ్మాయిని పెళ్లిచేసుకొన్నావు. ఇద్దరూ చక్కగా సంపాదించుకుంటున్నారు. నీకంటూ ఓ భవంతిని ఏర్పరుచుకొన్నావు. ఇంతకన్నా మనిషికేం కావాలిరా! అతణ్ణి ఎందుకు రావద్దు అంటున్నాడో, అందుకు తగిన కారణాలు ఏమిటో ఫోనులోనే క్లుప్తంగా వివరించాడు పరమేశం. అంటే నాన్నగారు ఇవన్నీ ఉంటే మనిషికి ఇంకేం అక్కర్లేదా? ప్రేమని పంచే బంధువులు, స్నేహితులకన్నా మీ దృష్టిలో డబ్బే ప్రధానమన్న మాట, నిష్ఠూరంగా అన్నాడు.

అలా అని ఎవరన్నారు? ఏనా ఈరోజుల్లో డబ్బే ప్రధానం. డబ్బున్నవాడికున్న విలువ, అది లేనివాడి కుండదు తెలుసా? కాబట్టి నామాట విని, ఇండియాకి వచ్చేస్తాను లాంటి పిచ్చి, పిచ్చి ఆలోచనలకు స్వస్తి చెప్పి. ఉన్నన్నాళ్ళు హాయిగా రెండు చేతులా సంపాదించుకో, సలహానిచ్చాడు పరమేశం.

సరే నాన్నగారు మీరు నామాట ఎప్పుడు విన్నారు కనక. ఆ... అన్నట్లు మీకు ఈ మధ్యన తరచూ ఒంట్లో బాగోవటంలేదని శంకరం మావయ్య చెప్పాడు. మీ మొండిపట్టుతో కనీసం మాకు మీ సేవ చేసుకొనేందుకైనా అవకాశం లేకుండా చేస్తున్నారు, బాధగా అన్నాడు శ్రవణ్.

అదేం లేదురా మీ మావయ్య కొంచెం ఎక్కువ చేసి చెబుతున్నాడు. నాకేం నేను గుండ్రాయిలా చక్కగా తిరుగుతున్నాను. పైగా ఈమధ్యనే పనివాణ్ణి కూడా పెట్టుకున్నాను. అందుచేత నా గురించి నువ్వు అనవసరంగా ఎక్కువ ఆలోచించకు తెలిసిందా, చెప్పాడు పరమేశం.

ఎంతైనా పనివాడు పనివాడే కదా నాన్నా! వాడేం చేసినా డబ్బుకోసమే చేస్తాడు. కన్నవాళ్లలా చెయ్యడు కదా, ఎలాగైనా తండ్రిని తాము ఇండియాకి రావడానికి ఒప్పించడానికి సర్వవిధాలా ప్రయత్నం చేస్తూ అన్నాడు శ్రవణ్.

శ్రవణ్! మరోసారి చెబుతున్నాను. ఇంకో రెండేళ్ల వరకు నువ్వు ఇండియా మాటెత్తావంటే నామీద ఒట్టే, ఆఖరి అస్త్రం ఉపయోగిస్తూ అన్నాడు పరమేశం.

సారీ నాన్నా, ఇంక ఈ విషయంలో మిమ్మల్ని మరోసారి ఇబ్బంది పెట్టను, ఉంటాను మీ ఆరోగ్యం జాగ్రత్త అంటూ విరక్తిగా ఫోను పెట్టేసాడు శ్రవణ్.

***

హలో శ్రవణ్! నువ్వు అర్జెంటుగా ఉన్న పళంగా ఇండియాకి రావాలి, గాబరాగా ఫోనులో చెప్పాడు శంకరం.

'ఏమైంది మావయ్యా' ఆతృతగా అడిగాడు శ్రవణ్.

'సడన్‌గా మీ నాన్నకి గుండెపోటు వచ్చింది. డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళే అవకాశం కూడా ఇవ్వకుండా మీ అమ్మ దగ్గరికి మీనాన్న కూడా వెళ్ళిపోయాడు' కన్నీళ్ళు తుడుచుకుంటూ చెప్పాడు శంకరం.

ఇప్పటికిప్పుడు ఉన్నపళంగా రావడం అంటే కుదరదు మావయ్యా. ఎందుకంటే ఇక్కడ రెండురోజుల వరకు ఫ్లైట్లు బైలుదేరడం కష్టం, ఏడుస్తూ అన్నాడు శ్రవణ్.

'మరిప్పుడెలారా?' అడిగాడు శంకరం.

ఎలా ఏముంది మావయ్యా. నేను నెత్తీనోరు మొత్తుకున్నా నన్ను ఇండియాకి రాకుండా చేసాడు నాన్న. ఏంచేస్తాం అంతా నా ఖర్మ. ఇంతకాలం ఆయన బాగోగులన్నీ దగ్గరుండి చూసారు కద మావయ్యా. ఈ కార్యాన్ని కూడా మీరే గట్టెక్కించండి. నేను ఇక్కడి పనులు పూర్తిచేసుకొని పదోనాటికి వస్తాను, బాధగా అన్నాడు శ్రవణ్.

***

ఏమిటోరా అంతా కలలా జరిగిపోయింది. నాన్నని ఆ మృత్యువు ఇంత అకస్మాత్తుగా కబళిస్తుందని కలలో కూడా అనుకోలేదు, శ్రవణ్‌ని ఓదారుస్తూ అన్నాడు శంకరం.

పోనీలెండి మావయ్యా, ఇప్పుడు మనం బాధపడి మాత్రం ఏం ప్రయోజనం. నేను ఎప్పటి నుండో ఆయనతో అంటూనే ఉన్నాను. నేను ఇండియాకి వచ్చేస్తాను. ఈ వయసులో మీకు నాతోడు అవసరం. అలాగే మాకు మీతోడు అవసరం అని ఎంత చెప్పినా వినలేదు. ఇప్పుడు నేను సంపాదించిన ఈ లక్షలు మా నాన్నని తిరిగి తేగలవా మావయ్యా? అమాయకంగా అడిగాడు శ్రవణ్.

'ఊరుకో బాబూ, ఊరుకో' అతని భుజంమీద చెయ్యి వేస్తూ ఓదార్పుగా అన్నాడు శంకరం.

ఎందుకు మావయ్యా నాన్నకి అమెరికా అంటే అంత పిచ్చి. ఇప్పుడు చూడు అటు కోడల్ని, ఇటు మనవడి అచ్చటా ముచ్చటా గాని చూడగలిగేడా? ఆయన నన్ను అమెరికా పంపి ఏం సుఖపడ్డారు, బాధగా అన్నాడు.

'ఏదో నువ్వు సుఖంగా ఉంటావనుకొని' అన్న శంకరాన్ని మధ్యలోనే ఆపుతూ 'అదంతా ఆయన భ్రమ మావయ్యా! నేనక్కడ ఉన్నంతకాలం జీవచ్ఛవంలాగే బ్రతికాను. అక్కడివాళ్ళు మనల్ని ఒక చీడపురుగులా చూస్తారు. ఎందుకంటే వాళ్ళకి తెలుసు మనం డబ్బు సంపాదన కోసమే అక్కడికి వచ్చామని. అందుకోసం ఏమైనా చేస్తామని. ఇక్కడి నుండి అక్కడికి వెళ్ళినవారిలో చాలా మంది మధ్యలోనే ఉద్యోగాలు పోగొట్టుకొని, తిరిగి ఇండియాకి రాలేక అక్కడే ఏదైనా బారులలోనో, పెట్రోలు పంపులోనో పనిచేస్తూ కాలం గడుపుతున్నారు. ఈ విషయం తెలియని వారి తల్లితండ్రులు మాత్రం మా అబ్బాయి అమెరికాలో ఉన్నాడని తెగ మురిసిపోతారు. అక్కడ పడే బాధలు వర్ణనాతీతం మావయ్యా. అమెరికా జీవనం 'మేడిపండు' లాంటిది. అక్కడ ఉన్నవారికి గాని ఆ బాధలు తెలియవు. మన తిండి దొరకదు. కడుపునిండా తృప్తిగా భోంచేసి ఎన్నో రోజులయ్యింది మావయ్యా. ఏం ఖర్చు పెట్టాలన్నా ఆ డాలర్లని మన రూపాయిల్లో లెక్కచూసుకొని అమ్మో ఇంత ఖర్చు పెట్టాలా అని ఖర్చుపెట్టే ప్రతి పైసాను చూసుకుంటూ ఆఖరికి నోరు కూడా కట్టుకుని కూడబెడతారు. నీకు ఇంకో విషయం కూడా చెప్పాలి మావయ్యా! అబ్బాయి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు అంటే ఇక్కడుండే ఆడపిల్ల తల్లితండ్రులు ఇంకేం ఆలోచించకుండా ఆ సంబంధాన్ని చెయ్యడానికి ముందుకొస్తున్నారు. కాని అక్కడ పుట్టి పెరిగిన అమ్మాయిని పెళ్ళిచేసుకోవడానికి అక్కడి అబ్బాయిలుగాని, వారి తల్లితండ్రులుగాని సిద్ధపడరు, ఎందుకంటే అక్కడే పుట్టిపెరిగిన పిల్లల్లో విచ్చలవిడితనం ఎక్కువని వాళ్ళ అభిప్రాయం. అక్కడికి వెళ్ళినవారు మన సభ్యతా సంస్కారాలను మర్చిపోయి, అక్కడి నాగరికతకు అలవాటుపడిపోయి అదే గొప్పనుకుంటున్నారు. భార్యాభర్తలిద్దరు ఉద్యోగం నిమిత్తం బైటికి వెళ్ళిపోతే ఇంట్లో పిల్లల్ని చూసే నాథుడు లేక వాళ్లని బలవంతంగా 'కేర్ సెంటర్లో' ఉంచవలసి వస్తుంది. అదే ఇక్కడైతే చక్కగా పెద్దవాళ్ళ సంరక్షణలో పిల్లలు ఎంతో క్రమశిక్షణతో పెరుగుతారు. కానీ మాకా అదృష్టం లేదు మావయ్యా! భార్యాభర్తలిద్దరూ ఏ వీకెండ్స్‌లోనో తప్పించి మిగతా రోజుల్లో కలుసుకొనే అవకాశాలు కూడా తక్కువే, చెప్పడం ఆపాడు శ్రవణ్.

'నువ్వు అలా అంటే ఒప్పుకోనురా, నిన్ను మీనాన్న ఇండియాకి తిరిగి రానివ్వలేదని అక్కసుతో అలా చెబుతున్నావు' అవునా? అడిగాడు శంకరం.

లేదు మావయ్యా నేనెప్పుడు ఆ ఉద్దేశంతో అనలేదు, చెప్పాడు శ్రవణ్.

'సరే ఇంతకీ నువ్వు తిరిగి అమెరికాకి ఎప్పుడు వెళుతున్నావు?' మాటమారుస్తూ అన్నాడు శంకరం.

ఏంటి మావయ్యా, నీకింత చెప్పినా అర్థం కాలేదా? ఆశ్చర్యంగా శంకరం వంక చూస్తూ అడిగాడు శ్రవణ్.

'ఒరేయ్ చెప్పడం వేరు, చెయ్యడం వేరు' కూల్‌గా చెప్పాడు శంకరం.

అందుకే మావయ్యా నేను, లిల్లీ ఒక నిర్ణయానికి వచ్చాం, చెప్పడం ఆపాడు శ్రవణ్.

'ఏంటన్నట్లు' చూసాడు శంకరం.

ఏంలేదు మావయ్యా. ఇంక నేను, లిల్లీ అమెరికాకి తిరిగి వెళ్ళం. లిల్లీకి మన భారతీయ సంస్కృతి అన్నా, సాంప్రదాయం అన్నా ఎంతో ఇష్టం అంతకుమించి గౌరవం కూడాను. పెళ్ళికాకముందు లిల్లీ మన సంస్కృతి మీద ఇండియాలోనే ఉండి రీసెర్చి కూడా చేసింది. అందుకే మేం ఇక్కడే ఉండిపోయి, అమ్మానాన్నల పేరుమీద ఓ అనాధ ఆశ్రమాన్ని, వృద్ధాశ్రమాన్ని నడిపి వారి రుణం తీర్చుకోవాలనుకొంటున్నాను, తన మనసులోని అభిప్రాయాన్ని చెప్పాడు శ్రవణ్.

బావుందిరా, నీ ఆలోచన అమోఘం. తప్పకుండా అలాచేసి నీ కన్నవారి రుణం తీర్చుకో మెచ్చుకోలుగా అన్న శంకరం, ఆ... అన్నట్లు మావాడు సుందరం అమెరికా వెళ్తాను అంటున్నాడు. ఇవి మావాడి 'వీసా' పేపర్లు కొంచెం చూసిపెట్టు, నేను మరలా వస్తాను అంటూ అతని చేతిలో 'వీసా' పేపర్లుంచి గబగబా బైటికి నడిచాడు.

ఇంతసేపు అమెరికాలో తాను పడ్డ కష్టాలు, బాధల్ని వినికూడా తన కొడుకుని అమెరికాకి పంపించాలనుకుంటూ శంకరం మావయ్య చేసుకొంటున్న 'ఆత్మ వంచనకి' నవ్వాలో, ఏడవాలో తెలియని శ్రవణ్ అయోమయంగా మావయ్య వెళ్తున్న వైపే చూస్తూ ఉండిపోయాడు.

*